క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ప్రోగెస్ కార్డులను చూపుతున్న విద్యార్థులు

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని చింతలపల్లి ఎంపీపీ(స్పెషల్) స్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూర్తయిన తరగతుల మార్కుల జాబితాలు అందజేశారు. పై తరగతులకు ప్రమోట్ చేసి అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు గ్రాడ్యుయేషన్ డే ఎంతో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం రవిమనోహర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పూజ పాల్గొన్నారు.

కోలుకోలేక బాలుడి మృతి



భరత్(ఫైల్)

పాములపాడు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రైతు కుటుంబంలోని బాలుడు కోలుకోలేక బుధవారం మృతి చెందాడు మిగతా కుటుంబ సభ్యులు చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఈ నెల 2న ఇస్కాల గ్రామానికి చెందిన రైతు సోమేశ్వరుడు అప్పుల బాధ భరించలేక తల్లి శివమ్మ, భార్య లావణ్య, కూతురు నిఖిత, కుమారుడు భరత్‌లతో కలిసి శీతల పానియంలో గడ్డి మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అందులోని భరత్ అనే బాలుడు 20 రోజుల పాటు చికిత్స పొంది కోలుకోలేక మృతి చెందాడు. మిగతా వారి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కశ్మీర్ పహల్గామ్ దాడి అమానుషం

ఆత్మకూరు: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసి 27 మందిని చంపడం అమానుషమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ మోమిన్‌అహ్మద్ హుసేన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉగ్రవాద దాడిని క్షమించరాదన్నారు. ప్రాణాలు కోల్పోయిన 27 మంది కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

భోజనం గ్రామంలో ఫ్యాక్షన్ జోన్ సీఐ పర్యటన

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామం భోజనం గ్రామంలో బుధవారం ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ జగన్‌మోహన్, పోలీసులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మహానంది: మండల పరిధిలోని గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దకందాలకు చెందిన బోయ వెంకట శివరాముడు, శ్రీనివాసులు బైక్ మీద బోయిలకుంట్ల వైపు వెళ్తుండగా రైల్వేట్రాక్ దాటిన తర్వాత గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని వడ్లరామాపురం గ్రామశివారు అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ బుధవారం తెలిపారు. 10 లీటర్ల నాటుసారాను, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

రైలు కింద పడి యువకుడికి గాయాలు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదవశాత్తూ రైలుకింద పడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ తెలిపిన వివరాలు.. కొలిమిగుండ్లకు చెందిన లోడ్ షిఫ్టింగ్ పనులు చేసే చౌడయ్య రైల్వేట్రాక్‌పై పడి ఉండటంతో స్టేషన్ మాస్టర్ గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని రెండు కాళ్లు విరిగిన చౌడయ్యను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న డీఎస్పీలు

మహానంది: ఆళ్లగడ్డ, ప్రొద్దుటూరు డీఎస్పీలు ప్రమోద్, భావన కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

‘పది’లో మెరిసిన విద్యా కుసుమాలు

పదో తరగతిల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. అధిక మార్కులతో అదరగొట్టారు. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల వ్యాప్తంగా పేద విద్యార్థులు సైతం తమ చదువుకు పేదరికం అడ్డుకాదంటూ నిరూపించారు.



బండిఆత్మకూరు జెడ్పీహై స్కూల్ విద్యార్థి ఎస్.సుమంత్‌ను అభినందిస్తున్న ఎంఈఓ యశోదా, హెచ్‌ఎం హసీన




హర్షియా(563) దీపికయాదవ్(560)

● ఆత్మకూరు: మండలంలోని మంచి ఫలితాలు సాధించామని ఎంఈఓ బాలాజీనాయక్ వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులోని బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్.హర్షియా 563, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దీపికయాదవ్ 560 మార్కులు సాధించారన్నారు. మండల వ్యాప్తంగా బాలికలు 70, బాలురు 49శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

● మిడుతూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో వై.శివశంకర్ 576, కె.సాయిస్ఫూర్తి 563 మార్కులు సాధించినట్లు ఎంఈఓ ఫైజున్నీసాబేగం తెలిపారు.



వై.శివశంకర్ (576)

శ్రీశైలంప్రాజెక్ట్: 10వ తరగతి ఫలితాల్లో శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ గురుకుల, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ హవా కొనసాగించారు. మహాత్మా జ్యోతి భాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి పి.రంజన్ 592, ఎ.వేదసాయికృష్ణ 588, కె.విష్ణు 585, పి.దస్తగిరి 584, కె.హరికృష్ణ 584, జి.విజయ్ 580 మార్కులు సాధించారు. గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో నున్నావత్ రేవంత్ నాయక్ 590, రమావత్ ఈశ్వర్ నాయక్ 584 మార్కులను సాధించారు. గిరిజన గురుకుల పాఠశాలలో 95, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 60 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● బండిఆత్మకూరు: పదో తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా 83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండల కేంద్రంలోని జెడ్పీ హై స్కూల్ విద్యార్థి ఎస్.సుమంత్ 591, ఎర్రగుంట్ల విద్యార్థి ఎస్.శృతి 584, ఈర్నపాడు విద్యార్థి వి.కావేరి 580 మార్కులు సాధించారు.




పి.రంజన్(592), నున్నావత్ రేవంత్ నాయక్(590)




ఎస్.శృతి(585), వి.కావేరి(580)




టి.పావని(581) జి.జయంత్(596)

నందికొట్కూరు: పదో తరగతి ఫలితాల్లో మండలం వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సుభాన్ తెలిపారు. బ్రాహ్మణకొట్కూరు జెడ్పీ స్కూల్‌లో టి.పావని 581, మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో పి.అనిత 563 మార్కులు సాధించినట్లు తెలిపారు. కొణిదేల జెడ్పీ హైస్కూల్‌లో జి.నందిని 55 మార్కులు సాధించారన్నారు. కాగా పట్టణంలోని విజయవాణి ప్రైవేట్ స్కూల్ విద్యార్థి జి.జయంత్ 596 మార్కులు సాధించాడు.



వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాములపాడు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది





కమలాకర్(565), చైతన్యశ్రీ(561), ప్రవళిక(560)

● మహానంది: మహానంది మండలంలో 463 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 311 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో కమలాకర్ 565, చైతన్యశ్రీ 561, ప్రవళిక 560 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. కేజీబీవీలో అపూర్వ 519, సురేఖ 504 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ హర్షిత తెలిపారు.





మల్లన్న(593), యశస్విని(591), హైమావతి(589)

● పాములపాడు: స్థానిక ఏపీ మోడల్‌స్కూలులో 88 మందికి గాను 88 మంది విద్యార్థులు పాసయ్యారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు తమ పాఠశాల విద్యార్థులు జంగాల పదిరె మల్లన్న 593, యశస్విని 591, హైమావతి 589 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూల్‌లో 99 మందికి గాను 77 మంది, వానాలలో 24 మందికి గాను 22, వేంపెంటలో 51 మందికి గాను 45, లింగాలలో 23 మందికి గాను 17, తుమ్మలూరులో 36 మందికి గాను 28, కేజీబీవీలో 36 మందికి గాను 31 మంది పాసయ్యారు.





ఇ.చెన్నకేశవులు గౌడ్(570) వై. మోహన సుధా(567) జే.శివచరణ్ (562)

● పగిడ్యాల: మండల వ్యాప్తంగా 413 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 342 మంది విద్యార్థులు(82.81 శాతం) పాసైనట్లు విద్యాధికారి సుభాన్ తెలిపారు. నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇ.చెన్నకేశవులు గౌడ్ 570, ఆదర్శ పాఠశాల విద్యార్థులు వై.మోహన సుధా 567, జే.శివచరణ్ 562 మార్కులు సాధించారన్నారు. లక్ష్మాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల 97.33, పాత ముచ్చుమర్రి జిల్లాపరిషత్ పాఠశాల 94.87, నెహ్రూనగర్ జెడ్పీ పాఠశాల 92.59, కేజీబీవీ 92.1, ఆదర్శ పాఠశాల 89.41 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

పది ఫలితాల్లో మోడల్‌స్కూల్ విద్యార్థుల విజయదుందుభి




హారిక(584) విష్ణు(576)



బీబీ అప్సానా(575)

జూపాడుబంగ్లా: పదో తరగతి ఫలితాల్లో మోడల్‌స్కూల్ విద్యార్థులు విజయదుందుబీ మోగించారు. 91 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 75 మంది పాసయ్యారు. అందులో హారిక 584, విష్ణు 576, బీబీ అప్సానా 575 మార్కులు సాధించారు. మండ్లెం జెడ్పీహెచ్ స్కూల్‌లో 28 మందికి గానూ 20 మంది పాస్ కాగా బోయ కల్పన 577 మార్కులు సాధించినట్లు ఎంఈఓ చిన్నమద్దిలేటి తెలిపారు.



అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో జూపాడుబంగ్లా మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు

● కొత్తపల్లి: పదో తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా 79.78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ-2 ఇనాయతుల్లా తెలిపారు. ఇందులో ముసలమడుగు జెడ్పీ స్కూల్‌లో విష్ణుప్రియ 542, దుద్యాల జెడ్పీ స్కూల్‌లో రహిమా 540 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

● వెలుగోడు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థి షేక్ సాదిక్ 582, ఎం సురేంద్ర 575 మార్కులు సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చాందిని 577, పహిమ 566 మార్కులు సాధించారు.




విష్ణుప్రియ రహిమా



షేక్ సాదిక్ (582)

బాల్య వివాహాల నివారణకు కృషి చేద్దాం

● జిల్లా బాలల సంరక్షణ అధికారిణి డి.స్వప్నప్రియదర్శిని

ఆత్మకూరు: బాల్య వివాహాల నివారణకు కృషి చేద్దామని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి డి.స్వప్నప్రియదర్శిని, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండి ఉండాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. నిరక్షరాస్యులైన మహిళలకు, 8వ తరగతి నుంచి 10వ తరగతి మధ్య చదువు ఆపేసిన పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు. చిత్రంలో జిల్లా బాలల సంరక్షణ అధికారిణి డి.స్వప్నప్రియదర్శిని

సంక్షిప్తం

ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి

మహానంది: రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటే ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతారని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి తెలిపారు. తమ్మడపల్లెలో బుదవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో డాక్టర్ ఎల్. విజయభాస్కర్, డాక్టర త్రివిక్రమ్‌రెడ్డి, డాక్టర్ శివజ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

జూపాడుబంగ్లా: పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కంపెనీ రైతుల ఒప్పందం మేరకు రైతులు అధికంగా పొగాకు సాగుచేశారన్నారు. రైతులకు ఇచ్చిన మాట మేరకు కంపెనీ వారు గిట్టుబాటు ధరలకు పొగాకు కొనుగోలు చేయాలన్నారు. లేని ఎడల రైతులను పోగుచేసి ఆందోళన చేస్తామన్నారు.

వెలుగోడులో చోరీ

వెలుగోడు: పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో నివాసముంటున్న పులిమద్ది శ్రీనివాసులు ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి కాంపౌండ్‌లో ఉంచిన రూ.లక్ష విలువ చేసే కూల్ డ్రింక్స్ బాక్స్‌లు, మోటారు, కంప్రెషర్, కుండ తదితర వస్తువులు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

శ్రీశైలంలో ‘స్వచ్ఛసేవా’

శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా గురువారం క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో ఆలయ ప్రధాన వీధులు, గంగాధర మండపం నుండి నంది మండపం వరకు, డొనేషన్ కౌంటర్, అన్నదాన విభాగం, గణేష సదన్, ఘంటామఠం, యాంపిథియేటర్, టూరిస్ట్ బస్టాండ్, పాత ఫిల్టర్ బెడ్ ప్రాంగణం పలు చోట్ల పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమములో దేవస్థాన అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంతమైన జీవితం గడపాలని డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాల జోలికి ఎవరూ వెళ్లొద్దన్నారు. రాజకీయాల పేరుతో ఏ పార్టీ నాయకులు ఘర్షణ వాతావరణాన్ని కల్పించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ రాము, సిబ్బంది ఉన్నారు.

రైతులకు ప్రోత్సాహకం

జూపాడుబంగ్లా: పండ్లతోటలు పెంచుకునే ఆసక్తి ఉన్న బోర్లు, బావులున్న చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహక రాయితీలిస్తున్నట్లు హార్టికల్చర్ నియోజకవర్గ అధికారిణి తేజశ్విని, ఎంపీడీఓ గోపికృష్ణ, కోర్స్ డైరెక్టర్ ఇస్మాయిల్ తెలిపారు. బుధవారం వెలుగు కార్యాలయంలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రేష్మ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రవి, ఏపీఎం అంబుమ్మ పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు చేయించండి

ఆత్మకూరు: స్థానిక 19వ వార్డు గరీబ్‌నగర్‌లో చేతిపంపునకు మరమ్మతులు చేయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, శాఖ కార్యదర్శి సురేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం వారు చేతిపంపును పరిశీలించారు. చెడిపోయి రెండేళ్లవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు నాయకుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు స్పందించి చేతిపంపును బాగు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, వీరన్న, కిరణ్, భాస్కర్, మహిళా సంఘం నాయకురాళ్లు శారద, సువర్ణ పాల్గొన్నారు.

ఉపాధి మేట్లకు మ్యాపింగ్ చేసి లాగిన్ ఇవ్వాలి


కొత్తపల్లి: ఉపాధి మేట్లకు మ్యాపింగ్ చేసి లాగిన్ ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు డిమాండ్ చేశారు. బుధవారం చిన్న గుమ్మడాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. చిన్న గుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం, సింగరాజుపల్లి మూడు గ్రామాలు కలిసి ఒకే ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారన్నారు. ఉన్న ఫీల్డ్‌అసిస్టెంట్‌ని తాత్కాలికంగా తొలగించారన్నారు. గ్రామపంచాయతీలో కొంతమంది మేట్లకు మాత్రమే మ్యాపింగ్ చేసి ఆన్లైన్ మస్టర్ వేయడానికి లాగిన్ ఇచ్చారన్నారు. చిన్న గుమ్మడాపురం గ్రామంలో చిన్న స్వాములు మేటికి లాగిన్ ఇవ్వడం లేదని, ఆ గ్రామంలో పనిచేస్తున్న కూలీలకు ఆన్లైన్ మస్టర్ వేయడానికి సింగరాజు పల్లి నుంచి రావడానికి ఆలస్యం అవుతుందని, రెండవసారి ఫోటోకి మధ్యాహ్నం సమయం పడుతుందన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

నీలగిరి చెట్ల ప్లాంట్‌లో మంటలు

మహానంది: మహానందిలోని పార్వతీపురం టోల్‌గేట్ వద్ద ఉన్న నీలగిరి తైలం చెట్లు ప్లాంట్‌లో బుధవారం రాత్రి అగ్నిమంటలు ఎగిసి పడ్డాయి. వందల సంఖ్యలో చెట్లు కాలిపోతున్నట్లు స్థానికులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు స్పందించి మంటలను అదుపులోకి తీసుకొని రావడంతో పాటు భవిష్యత్తులో అగ్నిప్రమాదం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నీలగిరి ప్లాంట్‌లో ఎగిసి పడుతున్న మంటలు

చారిత్రక సంపద పరిరక్షణకు చర్యలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర చారిత్రక సంపద పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా బుధవారం ఆయన స్థానిక పొట్టి శ్రీరాముల విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆర్. చంద్రశేఖరరెడ్డి తో కలసి క్షేత్రంలోని పలు పురాతన కట్టడాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట సహాయ స్థపతి ఐ.ఉమావెంకట జవహర్లాల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



క్షేత్రంలో పురాతన కట్టడాలను పరిశీలిస్తున్న దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు

వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టం రద్దు చేయాలి



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ జేఏసీ నాయకులు

నందికొట్కూరు: వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టం రద్దు చేయాలి ముస్లిం మైనార్టీల జేఏసీ నాయకులు రఫిక్ మౌలానా, కో కన్వీనర్ మహబూబ్ మౌలానా, అబుబక్కర్, సలాంఖాన్ డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తోందని వారు ఆరోపించారు. వక్ఫ్‌బోర్డ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జేఏసీ అధ్యక్షతన బుధవారం పటేల్ సెంటర్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు శాంతి ర్యాలీ చేపట్టారు. పటేల్ సెంటర్‌లో ముస్లింలను ఉద్దేశించి అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు, సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు రఘురామమూర్తి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు, అర్లప్ప, సీపీఎం నాయకులు నాగేశ్వరరావుతో పాటు పలువురు మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వక్ఫ్ చట్ట సవరణను ముస్లిం సమాజం, ముస్లిం పర్సనల్ లాబోర్డు పూర్తిగా అభ్యంతరం వ్యక్తం చేస్తుందని చెప్పారు. ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు సీఎం చంద్రబాబు మద్దతు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను ఎలా నియమిస్తారని నిలదీశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26కు విరుద్ధంగా ఉందని ఇస్లాం సంప్రదాయాలు, మత స్వేచ్ఛ, సాంస్కృతిక హక్కులు, మత సామరస్యం, సామాజిక ఐక్యతను ప్రభావితం చేస్తుందని గుర్తు చేశారు. సవరణ చట్టం వల్ల పురాతన మసీదులు, దర్గాలు ఉనికి కోల్పో ప్రమాదం ఉందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవికి వినతి పత్రం అందజేశారు. డీఎస్పీ రామాంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలరు హమిద్‌మియ్యా, ముస్లిం మైనార్టీ జేఏసీ నాయకులు రహిమాన్, అబ్దుల్లా, హసిక్ మౌలానా, నబిసాహెబ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తేనె నాగరాజు పాల్గొన్నారు.

భైరవాణి చెరువు నుంచి మట్టి తరలింపు ఆపాలి

● నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు

మహానంది: భైరవాణి చెరువు నుంచి మట్టి తరలింపు ఆపాలంటూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కూటమి ప్రభుత్వం రైల్వే కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతూ రైల్వేలైన్ బ్రాడ్‌గేజ్ పేరుతో లక్ష క్యూబిక్ మీటర్ల మట్టికి అనుమతి ఇవ్వడంపై గోపవరం గ్రామస్తులతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వామపక్ష పార్టీలు బుధవారం నిరసనకు దిగారు. గుంటూరు-గుంతకల్లు రైల్వేస్టేషన్ల మధ్యలో రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులకు మహానంది మండలం గోపవరం గ్రామంలోని భైరవాణి చెరువు నుంచి సుమారు 70వేల క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపుకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ నుంచి అనుమతులు వచ్చాయి. కూటమి ప్రభుత్వంలోని ఓ ఎంపీ బంధువు ఈ పనులను దక్కించుకున్నాడని, అందుకే అనుమతులు త్వరగా వచ్చాయని వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్యయాదవ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, మండల కార్యదర్శి సామేలు ఆరోపించారు. ఇదిలా ఉండగా 147 ఎకరాల విస్తీర్ణం ఉన్న భైరవాణి చెరువు క్రింద సుమారు 3600 ఎకరాల పంటలకు నీరు అందుతుంది. ఈ చెరువు నుంచి గోపవరం, నందిపల్లె, సీతారామాపురం గ్రామాల వరకు భూగర్భ జలాలు అందుతాయి. దీంతో అధికారులు రైల్వే పనుల పేరుతో మట్టికి క్యూబిక్ మీటర్‌కు రూ.1 చొప్పున, ఎస్ఎస్ఆర్ ధరల నిబంధనల ప్రకారం అనుమతులు ఇవ్వడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు నిండా ప్రస్తుతం నీళ్లున్నాయని, మట్టి కోసం నీళ్లను బయటికి పంపిస్తే పొలాలు ఎండటంతో పాటు గ్రామంలోని చేతిపంపులకు, బోరుబావులను నీళ్ల అందే పరిస్థితి ఉండదని వాపోయారు. అధికారులు స్పందించి మట్టి తరలింపు అనుమతులు రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాది పోలరాజు, అంబేడ్కర్ యువసేన జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతుల సంఘం నాయకులు జమాల్ బాషా, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



చెరువు వద్ద నిరసన చెబుతున్న గ్రామస్తులు, నాయకులు